# బురదనీరు

[కథానిక]

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

ఆ రోజు వర్షం పడి వెలిసింది. ఊళ్ళో పెద్దలూ, పిన్నలూ అంతా రచ్చరాయిమీదికి చేరేరు. అందులో నలుగురు డబ్బువేసి పేకాటాడుతూంటే తక్కినవాళ్ళు చూస్తూ, సలహాలిస్తూ ఆనందిస్తున్నారు. మాంతివీథి అప్పలనాయుడు మీసాలు పెనవేసుకుంటూ రాయిదగ్గరికి వచ్చేడు. అప్పలనాయుడికి ఊళ్ళో మంచి గౌరవం ఉంది. ఊరుకి మునసబు. డబ్బులేకపోయినా మంచి తెలివైనవాడని ప్రసిద్ధి. గొప్ప వ్యవహారవేత్త. తను ఊళ్ళో ఎవరికేసు పట్టుకున్నా జయం తప్పదు. చదువురాకపోయినా, తనలాగ ఏ ప్లీడరూ సలహా లివ్వ లేడు. ప్లీడర్లతోనూ, మేజిస్ట్రేటులతోనూ మాట్లాడాలన్నా, కోర్టుకి సాక్షుల్ని జతపెట్టాలన్నా, పోలీసు వాళ్ళతో వ్యవహారాలు చక్కబెట్టాలన్నా అతడి సహాయంలేంది ఏమీ జరగదు. ఊళ్ళో చదువుకున్న కరణంకూడా అతనిదగ్గర పనికిరాడు.

అప్పలనాయుడిని చూడగానే తమ్మన్నతాత లేచి దండం పెట్టేడు. తమ్మన్నతాత ముసలివాడు కాడు. యువకుడూ కాడు. ఓ నలభైఏళ్ళుంటాయి—మోతుబరిగైతు—మంచివాడు—బహారిజోలికి వెళ్ళడు. అంచేత అతడంటే ఆ వూళ్ళో గౌరవం ఉంది.

అప్పలనాయుడు నమస్కారం అందుకుని, "ఏం తాత, ఏటిసమాచారం, మీ పొలం ఉభా అయిందేట?"

"ఆ—అయింది మామా. కాని శాబులు దిగొచ్చినారు" అన్నాడు తమ్మన్న.

"ఏం?"

"ఈ కూలోళ్ళతో పడలేకపోతున్నాం మామా—మొగోడికి రూపాయి, ఆడదానికి అర్ధ. బాగా పొద్దెక్కేదాకా దిగబడి పొద్దు గూకకముందే పనొగ్గేస్తారు—ఏటి బరించటం సెప్పు?"

"నీకేటి, మారాజువి—"

"నీరు సమంగా నేదుగదా; నీరుంటే పోనీ, నువ్వన్నమాటే—"

"తాతా, నీరంటే గ్యాపకమొచ్చింది. ఈ యీధిలోంచి పోతూన్న మురగటినీరు ఎవరి పొలంలోకి ఎల్తాందిరా?"

వీధిలోంచి మురగటినీరు తాచుపాములా పారుతోంది. అందులో సాయంత్రపు అరుణకాంతులు పడుతున్నాయి. కాని బురదనీరు కాబట్టి మసిబారిన చిమ్నీలా ఉంది.

అప్పలనాయుడికి తెలుసు ఈ నీరు గండెప్పుడి పొలానికి పోతూందని. గండెప్పుడు కూడా మోతుబరే. కాని మోతుబరి రైతుల్లోకల్లా ఇంతవరకూ దావాల్లోకీ, తంటాల్లోకీ దిగకుండా కాలక్షేపంచేస్తున్న వాళ్ళు గండెపుడూ, తమ్మన్నతాతే. అంచేతే అప్పలనాయుడికి వీళ్ళనిచూస్తే కన్నెర్ర.

"ఒరే తాతా, ఈ నీరు నీయింటి పక్కనుంచే గదరా పోతాది—నీ మిరపతోటల్లోకి కట్టరా—" అని సలహా ఇచ్చేడు అప్పలనాయుడు.

"తప్పా మామా, మనకెందుకా నిష్టూరం— తొలికాడినించి ఆడిదే ఈ నీరు—"

"ఆడిదా నీరు—ఆడి బాబు గడించేడేట్రా? ఈదింలో పారే నీరు ఒకడిదేట్రా—అందరిదీన్ని. ఒరే! నన్నాకరికి ఎవ్వారగ్యానం లేనోడికింద కట్టేసి నావు—"

తమ్మన్నకి ఆశ కలిగింది. మురగటినీరు మంచి సత్తువయింది—ఆ నీరుపెడితే మిరపతోట ఇప్పటి కంటే నాలుగురెట్లు కాస్తుంది. కాని ఎలాగ?

"భయమేటిరా, పదేశ్, నేనున్నా—" అప్పలనాయుడు తమ్మన్న చెయ్యిపట్టుకుని ఈడ్చుకెళ్ళేడు. వీథిలోంచి పారే నీటికి కాలితో మన్నుతోసి మిరపతోటకి చిన్నకాలవ చేసేడు. నీరు దగ్గరగా ఉన్న మిరపతోటలోకి పరుగెత్తింది.

అప్పలనాయుడు తన ప్రజ్ఞకి తనలో తను సంతృప్తిపడ్డాడు. తను వేసిన పాచిక బాగానే పారింది. తమ్మన్న బుట్టలో పడ్డాడు. ఇంక గంటెప్పుడు కూడా పడాలి. అందులో వాడెంతసేపు! తన శిష్యులలో ఎవడినేనా ఒకడినిపంపి వాడిని రెచ్చగొట్టించగలడు.

బాగా చీకటి పడింది. తమ్మన్న తాత ఇంటికొచ్చి గుమ్మంలో చూరుకింద కూర్చుని ఆలోచిస్తూన్నాడు. సంవత్సరానికి పాతిక రూపాయలొచ్చే మిరపతోట తన కన్నో ఆశలు కలిగించింది—ఆ మురగటి నీరుగాని పారితే, ఆ తోట ఇంకెంతైనా కాస్తుంది. నాలుగేళ్లాగుతుంటే ఆతోటమీద వొచ్చే దానితల్లో ఒక చిన్న పెంకుటిల్లు లేవదియ్యొచ్చు. మరో నాలుగెకరాలు కొని చిన్న మామిడితోట వేశాడంటే ఇంక తన వెనకాల ఎంతమంది తిరుగుతారు! గంటెప్పడికి పెంకుటిల్లూ, మామిడితోటా ఉన్నాయి. వాడి బంగారపు కడియం, సిలుకులాల్చీ, అబ్బో—వాడిని చూడగలమా?

భార్య గురివి కిరసనాయిలుబుడ్డి వెలిగించి లోపలికి వచ్చింది.

"ఏటిక్కడ కూకున్నావు—సీకటి"—బుడ్డి నేలపెట్టి నిలబడేసరికి, చూరు గురివిబుర్రకి తగిలింది.

"దీని జిమ్మడ—అబ్బ—"

"గట్టిగా తగిలిందేటే—"

"నేనునే---"

"గురివీ! పెంకుటిల్లు కట్టిద్దామని ఎంతకాలమమో మనసుంది. కాని డబ్బుతోపని"-

"ఓలమ్మో- ఏటాశ - పెంకుటిల్లంటే మజాకా లేటి- పోనిద్దూ, బగవంతుడెంతిస్తే అంతే- నెసు, గంజి తాగుదుగాని—"

వీథిలో అడుగుల చప్పుడయింది. ఏమిటో అని లేచాడు తమ్మన్న.

"ఒరేయి తమ్మన్నా, ఇలా రారా—" వీథిలో గంటెప్పడు ఓ పదిమందిని తీసుకుని వచ్చేడు.

"నీ బాబుగాడి సొమ్మేటిరా, ఆనీరు, నీ మిరపతోటలో కట్టేశావు—"

"ఫోఫోన్—నీబాబుదేటి వరసపునీరు—"

వచ్చిన పెద్దమనుషులందరూ తలోకరీతి తీర్పు చెప్పేరు. కాని తగువు పెద్దదయి, కొట్టుకున్నంత వరకూ వచ్చింది. గంటెప్పడి పెళ్ళాం నోరు విప్పిందంటే మూడు లోకాలూ హడలు కొట్టిస్తుంది. తమ్మన్న పెళ్ళాం మాత్రం తక్కువదా—అదీ తిట్టింది. పౌరుషం, పరాక్రమం రెండువేపులా బాగా కనబరచారు. రాత్రి ఎవరి మానాన్ని వారు వెళ్ళిపోయారు.

కాని అప్పలనాయుడు రెండువేపులా ఉసిగొలిపేడు. కోర్టులో దావాలు పడ్డాయి. తమ్మన్న అప్పలనాయుడి దన్నుమీద మీసం మెలివేశాడు. గంటెప్పడు అప్పలనాయుడి శిష్యుడి దన్నుమీద లేచి నిలబడ్డాడు. రకరకాల సాక్ష్యాలు, ఫీజులు, లంచాలు, కర్చులు—అన్నీ ఓ వెయ్యిరూపాయలవరకూ ఒదిలిపోయాయి తమ్మన్నకి. కాని కేసుపోయింది.

తమ్మన్న మొహం వేలేసి, ఇంటి గుమ్మంలో కూర్చున్నాడు—అప్పలనాయుడు వచ్చి ఓదార్చేడు.

"మామా, కోర్టెక్కినోడూ, గాడిదెక్కినోడూ ఒక టేనట—ఊరికేనే సెప్పినారేటి సాస్త్రం—" అన్నాడు తమ్మన్న.

"తాతా, ఇంతట్లోకే బేజారెత్తిపోతే ఎలాగెల్తాయి ఎవ్వారాలు—మనం గెలిసితీరుతాం".

"ఇంక గెలిసేదేమిటి—పేడపిడకలు—"

"ఏటి, దీన్తోటి సరేటి—ఈడ కాకపోతే ఈడి బాబు ఇంకోడు. జిల్లాకోరటులో ఈ ఏసాలు సాగవురోయ్—అంతా న్యాయమే. భగమంతుడున్నాడ్రోయ్ తాతా—"

"ఏటి నెద్దూ సినబాబూ, ఈ కాలంలో నాయమేటి?" అన్నది గురివి. మళ్ళీ కోర్టెక్కితే తన వొంటిమీదున్న ఆ వొక్క నానూ ఎగిరిపోతుంది—

ఇది జూదం లాంటిది—ఓడిపోతున్న కొద్దీ పౌరుషం ఎక్కువవుతుంది.

"సీ—మీ కసలు పౌరుషం లేదేన్—మీతోటి నాకేటి? ఎలమోడివి కావురా? చిగ్గనేదూ? గంటెప్పుడు అలా ఛాతీ ఇరుచుకు తిరుగుతూంటే—"

తమ్మన్నలో దాగిఉన్న వెలమ పౌరుషం అంతా ఒక్కసారి సముద్ర కెరటంలా తోసుకొచ్చింది. మీసాలు మెలివేసి "సరే, పద మావా, దీని అంతేటో సూదాం—" అంటూ లేచాడు.

మళ్ళీ ఈసారి న్యాయం కోసం జిల్లా కోర్టుకి వెళ్ళేరు. ప్లీడరు బాగా ధైర్యం చెప్పేడు—అయినా ప్లీడరు రంగారావు కూడా మహా గట్టివాడు. ప్లీడరు వరకూ ఎందుకు, అతడి గుమాస్తా నరసయ్య—అబ్బో—అసాధ్యుడు. అతడు ప్లీడరుగారికే సలహాలు ఇస్తూంటాడు. కోర్టుచుట్టూ తిరగ్గా తిరగ్గా, లంచాలు, సాక్ష్యాలు, మతలబులు అన్నీ అవగా, తీర్పుఅయింది. బురదనీటి కేసు చాలా పెద్ద ప్రసిద్ధమయిన కేసయింది. తీర్పయేసరికి చాలాకాలం పట్టింది. తమ్మన్నకు ఈసారో వెయ్యిరూపాయి లొదిలిపోయాయి—కేసు మాత్రం పోలేదు. కాని గెలవాలేదు. బురదనీటి హక్కు ఊరందరికీ ఉందనీ, అందరూ ఉపయోగించుకో వచ్చుననీ, గంటెప్ప డొక్కడే ఉపయోగించుకోకూడదనీ, కాబట్టి ఇప్పుడు అందరికీ ఉపయోగంగా ఉండేటట్టు ఆ నీరు ఊరి చెరువులోకి వెళ్ళాలనీ కోర్టువారు తీర్పు చెప్పేరు. తీర్పుకి ఊళ్ళో అంతా సంతోషించారు.

తమ్మన్నకి రెండువేలు వొదిలిపోయాయి—ఆ విచారం ఉన్నా, వెలమ పౌరుషం చూపించానన్న సంతృప్తీ ఉంది. "రామిగాడి సాచ్చికం పాడయింది. నేకపోతేనా—ఆ నీరు మన మిరపతోటలో కొచ్చేదే" అన్నాడు పెళ్ళాంతో. పోయినడబ్బు పోతేపోయింది గాని కోర్టురూల్సు బాగా తెలిశాయి తమ్మన్నకి. కేసు గురించి పెళ్ళాం దగ్గిర డాబులుకొట్టేడు.

"సాల్నెద్దూ—కడుపులోనికూ డరక్క కోరుటు లెక్కినాం—నాగుజోడు, తీగె, నాను, మడిసెక్క అన్నీ ఎల్లిపోనాయి—ఏటో, కరమం—"

అంటూ ఏడిచింది గురివి.

ఆరిపోయిన చుట్ట గుమ్మం వొడ్డున పెట్టి, ఆవలిస్తూ నులకమంచం మీద నడుంవాల్చేడు. గురవి నేలమీద గోనెపగుచుకుని పడుకుంది. తమ్మన్న పూరిల్లు కూడా వాళ్ళతోటే నిద్రపోయింది.

కాని దూరాన్న చీకట్లో అప్పలనాయుడు కొత్తగా కట్టిన డాబా తెల్లగా కనిపిస్తోంది.

